మూతపడిన వాటర్ ప్లాంట్లు

- తాగునీటి కోసం ప్రజల ఇక్కట్లు
- వాటర్ ప్లాంట్ల నిర్వహణను గాలికొదిలేసిన ప్రజాప్రతినిధులు
- పాడవుతున్న మిషనరీ, విలువైన పరికరాలు
- పట్టించుకోని అధికారులు



కనగానపల్లిలో మూతపడిన వాటర్ ప్లాంట్

కనగానపల్లి: మండలంలోని పలు గ్రామాల్లో వాటర్ ప్లాంట్లు (నీటి శుద్ధి కేంద్రాలు) మూతపడ్డాయి. దీంతో పలుచోట్ల తాగునీటి కోసం ప్రజలు ఇక్కట్లు పడుతున్నారు. ప్రభుత్వ నిధులు, దాతల సహకారంతో మండలంలోని పలు గ్రామాల్లో వాటర్ ప్లాంట్లు ఏర్పాటు చేశారు. స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులు వాటి నిర్వహణను పట్టించుకోక పోవడంతో చాలా చోట్ల నిరుపయోగంగా ఉన్నాయి. ముఖ్యంగా మండల కేంద్రం కనగానపల్లిలో పంచాయతీ నిధులతో ఏర్పాటు చేసిన వాటర్‌ప్లాంటు చాలా రోజులుగా మూతపడింది. దీంతో స్థానిక గ్రామస్తులతో పాటు చుట్టు పక్కల గ్రామాల ప్రజలు ప్రైవేట్ వాటర్ ప్లాంట్లను ఆశ్రయిస్తున్నారు. అయితే ప్రైవేట్ వాటర్ ప్లాంట్ల నిర్వాహకులు నీటిని అధిక ధరలకు విక్రయిస్తున్నారు. నీటిని కూడా సరిగా శుద్ధి చేయటం లేదని స్థానికులు చెబుతున్నారు. ముత్తవకుంట, తల్లిమడుగుల, బాలేపాళ్యం గ్రామాల్లో కూడా దాతల సహకారంతో ఏర్పాటు చేసిన వాటర్ ప్లాంట్ల నిర్వహణను గాలికొదిలేశారు. ఫలితంగా వాటర్‌ప్లాంట్లు మూతపడ్డాయి. స్థానిక గ్రామాల ప్రజలు బయట ప్రాంతాలకు వెళ్లి నీరు తెచ్చుకోలేక పోతున్నారు. పంచాయతీ బోరుబావుల నుంచి వచ్చే నీటినే తాగుతున్నారు. దీనివల్ల అనారోగ్యానికి గురవుతున్నామని స్థానికులు వాపోతున్నారు. ఇక మండలంలోని మామిళ్లపల్లి గ్రామంలో ఆర్డీటీ సంస్థ సహకారంతో రూ.15 లక్షలు వెచ్చించి ఏర్పాటు చేసిన వాటర్‌ప్లాంటు కూడా మూతపడింది. ఈ ప్లాంటు మూతపడి చాలా రోజులు అవుతుండటంతో అందులో ఉన్న మిషన్లతో పాటు విలువైన పరికరాలన్నీ పాడవుతున్నాయి. రూ.లక్షలు వెచ్చించి ఏర్పాటు చేసిన ఈ వాటర్ ప్లాంట్లు పాడవుతున్నా స్థానిక అధికారులు, ప్రజాప్రతినిధులు పట్టించుకోవటం లేదని ప్రజలు వాపోతున్నారు. ఉన్నతాధికారులు స్పందించి వాటర్‌ప్లాంట్లు తెరిపించాలని కోరుతున్నారు.

తాగునీటికి ఇబ్బంది

"గ్రామంలో పంచాయతీ వాటర్ ప్లాంట్ మూతపడటంతో తాగునీటికి చాలా ఇబ్బందులు పడుతున్నాం. ప్రైవేట్ వాటర్ ప్లాంట్ల వద్ద నీటిని అధిక ధరలకు విక్రయిస్తున్నారు. నీటిని సరిగా శుద్ధి చేయడం లేదు. అధిక ధర చెల్లించేందుకు అవస్థలు పడుతున్నాం. ప్రజాప్రతినిధులు, అధికారులు స్పందించి వాటర్‌ప్లాంట్ తెరిపిస్తే బాగుంటుంది.

– నారాయణమ్మ, బీసీ కాలనీ, కనగానపల్లి

వృథాగా వదిలేశారు

ఆర్డీటీ సహకారంతో గ్రామంలో వాటర్ ప్లాంటు ఏర్పాటు చేశారు. అయితే స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులు దీనిని సక్రమంగా వినియోగించుకోక పోవడంతో చాలా రోజులుగా మూతపడింది. దీంతో అందులో ఉన్న విలువైన పరికరాలన్నీ పాడవుతున్నాయి. వాటర్ ప్లాంట్‌ను వృథాగా వదిలేశారు. అధికారులు స్పందించి వాటర్ ప్లాంట్‌ను తిరిగి వినియోగంలోకి తీసుకుని రావాలి."

– వేణుగోపాల్, మామిళ్లపల్లి గ్రామం

మృతుడి కుటుంబానికి పరామర్శ



నివాళులర్పిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

పుట్టపర్తి అర్బన్: చెర్లోపల్లి గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ సీనియర్ నేత చెన్నకేశవులు(55) గుండెపోటుతో శుక్రవారం మృతి చెందారు. విషయం తెలుసుకున్న ఎంపీపీ ఏవీ రమణారెడ్డి, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ ఈశ్వరయ్య, మాజీ కన్వీనర్లు గంగాద్రి, నరసారెడ్డి, నాయకులు నాగరాజు, తిప్పారెడ్డి తదితరులు వెళ్లి గ్రామానికి చేరుకుని చెన్నకేశవులు మృతదేహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. మృతుడి కుటుంబ సభ్యులను పరామర్శించారు. పార్టీ అన్నివిధాలుగా అండగా ఉంటుందని భరోసా కల్పించారు.

మహిళపై దాడి

కదిరి టౌన్: ఆస్తి వివాదంలో ఓ మహిళపై దాడి జరిగింది. వివరాలు.. కుటాగుళ్ల గ్రామానికి చెందిన పిల్లల రెడ్డమ్మ వ్యవసాయం చేసుకొని జీవనం సాగించేది. తన అత్తమామ, ఆడబిడ్డ బంధువుల మధ్య చాలా కాలం నుంచి ఆస్తి పంపకాల విషయంలో గొడవలు జరుగుతున్నాయి. ఈ క్రమంలో శుక్రవారం బాధితురాలి ఆడబిడ్డ పద్మ కుమారుడు సతీషకుమార్ రెడ్డమ్మ ఇంటిలోకి ప్రవేశించి ఆమెపై కట్టెతో దాడి చేశాడు. బాధితురాలి ఫిర్యాదు మేరకు నిందితుడిపై కేసు నమోదు చేసినట్లు పట్టణ సీఐ వి.నారాయణరెడ్డి తెలిపారు.

క్లుప్తంగా

క్రీడాదుస్తుల పంపిణీ



క్రీడాదుస్తులతో హ్యాండ్‌బాల్ క్రీడాకారులు

కదిరి అర్బన్: స్థానిక ఎస్టీఎస్ఎన్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో శనివారం నుంచి 54వ రాష్ట్రస్థాయి హ్యాండ్ బాల్ పోటీలు జరగనున్నాయి. ఈ పోటీల్లో పాల్గొనే శ్రీసత్యసాయి జిల్లా జట్టుకు హైదరాబాద్‌లో సీఐగా పని చేస్తున్న దిలీప్ క్రీడాదుస్తులు వితరణ చేశారు. ఈ దుస్తులను శుక్రవారం కదిరి సీఐ నారాయణరెడ్డి క్రీడాకారులకు అందజేశారు. సీఐ దిలీప్ కదిరి ఎస్టీఎస్ఎన్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల పూర్వ విద్యార్థి, హ్యాండ్ బాల్ క్రీడాకారుడు కూడా. కార్యక్రమంలో హ్యాండ్‌బాల్ అసోసియేషన్ జిల్లా కోశాధికారి వంశీ, సీనియర్ క్రీడాకారుడు కార్గొ ప్రసాద్ పాల్గొన్నారు.

మే డే ర్యాలీ జయప్రదం చేయండి



మాట్లాడుతున్న వేమయ్యయాదవ్

కదిరి టౌన్: అంతర్జాతీయ కార్మిక దినోత్సవం సందర్భంగా మే 1న తలపెట్టిన ర్యాలీని జయప్రదం చేయాలని సీపీఐ జిల్లా కార్యదర్శి వేమయ్య యాదవ్ కోరారు. శుక్రవారం స్థానిక ఆర్అండ్‌బీ కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. ప్రపంచ కార్మిక ఉద్యమం, కార్మికుల హక్కులను స్మరించుకునేందుకు మే డే జరుపుకుంటామన్నారు. మే డే ర్యాలీకి కార్మికులు పెద్దసంఖ్యలో తరలిరావాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు కదిరప్ప, లియాకత్ అలీ, ఆదెప్ప, మధునాయక్, మున్సిపల్ యూనియన్ నాయకులు సురేంద్ర, నాగరాజు, మహేంద్ర తదితరులు పాల్గొన్నారు.

సత్యసాయి ప్రేమ ప్రవాహిని వాహనాల ప్రారంభం



ప్రచార రథాలను ప్రారంభిస్తున్న ట్రస్ట్ మేనేజింగ్ ట్రస్టీ ఆర్‌జె.రత్నాకర్ రాజు

ప్రశాంతి నిలయం: సత్యసాయి ప్రేమ ప్రవాహిని ప్రచార రథాలను సత్యసాయి సెంట్రల్ ట్రస్ట్ మేనేజింగ్ ట్రస్టీ ఆర్‌జె.రత్నాకర్ రాజు శుక్రవారం ప్రశాంతి నిలయంలో జెండా ఊపి ప్రారంభించారు. ఐదు ప్రచార రథాలు దేశవ్యాప్తంగా 500 జిల్లాల్లో సత్యసాయి అవతార వైభవాన్ని ప్రచారం చేయనున్నాయి. ఒక్కో ప్రచార రథం 18 నెలల పాటు 30 వేల కిలోమీటర్లు పర్యటించనుంది. వీటి ద్వారా సత్యసాయి బోధించిన లవ్ ఆల్ సర్వ్ ఆల్ అన్న నినాదాన్ని దేశ నలుమూలల ప్రజలకు వివరించనున్నారు. కార్యక్రమంలో సత్యసాయి సేవా సంస్థల ఆల్ ఇండియా అధ్యక్షుడు నిమిష్ పాండ్యా, మాజీ మంత్రి గీతారెడ్డి, సత్యసాయి సేవాదళ్ బృందం సభ్యులు పాల్గొన్నారు.

సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలి



మాట్లాడుతున్న డీఎస్పీ శివనారాయణస్వామి

నల్లచెరువు: సైబర్ నేరాలపై ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని కదిరి డీఎస్పీ శివనారాయణస్వామి పేర్కొన్నారు. ఉప్పార్లపల్లిలో శుక్రవారం ఆయన సీఐ నాగేంద్రతో కలిసి పర్యటించారు. ఈ సందర్భంగా గ్రామంలో సైబర్ నేరాలపై ప్రజలకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. డీఎస్పీ మాట్లాడుతూ మీకు లాటరీ తగిలిందని లేదా లోన్ ఇస్తామని ఆశచూపి అగంతకులు ఫోన్‌కు వచ్చే ఓటీపీ నంబర్ల ద్వారా అకౌంట్లలో డబ్బు కాజేసేందుకు ప్రయత్నిస్తున్నారని, అలాంటి వారి పట్ల జాగ్రత్తగా ఉండాలన్నారు. రోడ్డు ప్రమాదాల నివారణపై అవగాహన కల్పించారు. ఏఎస్ఐ షెక్షావలి, సిబ్బంది పాల్గొన్నారు.

రమణ మహర్షి ఆరాధన



అన్నదానం చేస్తున్న దృశ్యం

ధర్మవరం అర్బన్: మార్కెట్‌యార్డు సమీపంలోనున్న రమణ మహర్షి ఆశ్రమంలో శుక్రవారం భగవాన్ రమణ మహర్షి 75వ ఆరాధన మహోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఆశ్రమ నిర్వాహకులు చిప్పల వెంకప్ప ఆధ్వర్యంలో రమణ మహర్షి చిత్రపటానికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. గోవును పూజించి గోమాత గొప్పతనాన్ని తెలియజేశారు. అనంతరం వేలాది మందికి అన్నదానం చేశారు.

వడ్డీ కట్టించుకుని రెన్యూవల్ చేయాలి



ఎస్‌బీఐ మేనేజర్‌కు వినతిపత్రం అందిస్తున్న సీపీఐ నాయకులు

బత్తలపల్లి: రైతు రుణాలను వడ్డీ కట్టించుకుని రెన్యూవల్ చేయాలని రైతు సంఘం, వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు డిమాండ్ చేశారు. శుక్రవారం మండల కేంద్రంలోని స్టేట్ బ్యాంకు మేనేజర్ సుభాష్, ఆంధ్రప్రగతి గ్రామీణ బ్యాంకు మేనేజర్ పరినా బేగం, యూనియన్ బ్యాంకు మేనేజర్ లింగన్న, బ్యాంకు ఆఫ్ బరోడా మేనేజర్ మనోహర్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రైతులు పంటలు పండక తీవ్ర ఇబ్బందుల్లో ఉన్నారన్నారు. బ్యాంకులలో వడ్డీ మాత్రమే కట్టించుకుని రెన్యూవల్ చేసుకుంటే రైతులకు ఇబ్బంది ఉండదని వారు బ్యాంకు మేనేజర్లను కోరారు. రైతు సంఘం జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ కమతం కాటమయ్య, రైతు సంఘం మండల కార్యదర్శి సాకే రామకృష్ణ, సీపీఐ మండల కార్యదర్శి బండల వెంకటేష్, వ్యవసాయ కార్మిక సంఘం మండల కార్యదర్శి బత్తల నాగభూషణ, వ్యవసాయ కార్మిక సంఘం మండల అధ్యక్షులు వడ్డె సన్న పెద్దన్న, మండల సహాయ కార్యదర్శి నారాయణ పాల్గొన్నారు.

పేదలకు ఇళ్ల స్థలాలు మంజూరు చేయాలి



తహసీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా చేస్తున్న దృశ్యం

తనకల్లు: ఇల్లు లేని పేదలకు వెంటనే ఇంటి స్థలాలు మంజూరు చేయాలని సీపీఎం నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు స్థానిక తహసీల్దార్ కార్యాలయం ఎదుట శుక్రవారం ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కూటమి నేతలు పట్టణ ప్రాంతాల్లో పేదలకు రెండు సెంట్లు, గ్రామీణ ప్రాంతాల్లో మూడు సెంట్లు చొప్పున ఇంటి స్థలాలు ఇస్తామని ఎన్నికల్లో హామీ ఇచ్చారన్నారు. అయితే కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 11 నెలలు గడుస్తున్నా ఇంతవరకు పేదలకు సెంటు స్థలం కూడా ఇవ్వలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. వెంటనే 793 సర్వే నెంబర్‌లోని ప్రభుత్వం స్థలంలో పేదలకు ఇంటి పట్టాలను మంజూరు చేయాలని పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. అనంతరం ఆర్ఐ స్వామికి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో సీపీఎం మండల కార్యదర్శి శివన్న, సీఐటీయూ మండల కన్వీనర్ ఒంటెద్దు వేమన్న, నాయకులు శ్రీనివాసులు, చలపతి, నాగేంద్రనాయుడు తదితరులు పాల్గొన్నారు.

చదరంగంతో మేధాశక్తి పెంపు



మాట్లాడుతున్న కళాజ్యోతి అధ్యక్షుడు నారాయణప్ప

ధర్మవరం అర్బన్: చదరంగంతో మేధాశక్తి పెరుగుతుందని కళాజ్యోతి అధ్యక్షుడు నారాయణప్ప, ఉపాధ్యక్షుడు శింగనమల రామకృష్ణ, కార్యదర్శి రామకృష్ణ తెలిపారు. పట్టణంలోని కళాజ్యోతిలో శుక్రవారం వేసవి ఉచిత చదరంగం శిక్షణ శిబిరాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యార్థులు వేసవి సెలవులను వృథా చేయకుండా చదరంగం క్రీడను ఉచితంగా నేర్పిస్తున్నామని తెలిపారు. మే 25వతేది వరకు శిక్షణతోపాటు చదరంగం టోర్నీ నిర్వహించి ప్రతిభ చూపిన వారికి బహుమతులు అందిస్తామన్నారు. అనంతరం చదరంగం ఆడుతూ శిక్షణ శిబిరాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో పీడీలు వెంకటేష్, రామకృష్ణ, రిటైర్డ్ లెక్చరర్ సోమశేఖర్, లయన్స్‌క్లబ్ అధ్యక్షుడు వేణుగోపాలాచార్యులు, కార్యదర్శి రమేష్‌బాబు, కోశాధికారి నాగేంద్ర, చదరంగం శిక్షకులు శివకృష్ణ, ఆదిరత్నం, కిషోర్ తదితరులు పాల్గొన్నారు.

మలేరియా నిర్మూలనకు కృషి చేద్దాం



కదిరిలో ర్యాలీ నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది



పుట్టపర్తిలో ర్యాలీని ప్రారంభిస్తున్న డీఎంహెచ్‌ఓ ఫైరోజ బేగం



ధర్మవరంలో ర్యాలీ ప్రారంభిస్తున్న డిప్యూటీ డీఎంహెచ్‌ఓ సెల్వియా సాలోమన్

కదిరి టౌన్: ప్రతి ఒక్కరూ మలేరియా నిర్మూలనకు కృషి చేద్దామని పడమర మలేరియా సబ్ యూనిట్ ఆఫీసర్ డాక్టర్ దేవలనాయక్ పేర్కొన్నారు. ప్రపంచ మలేరియా దినోత్సవాన్ని పురస్కరించుకుని స్థానిక ఏరియా ఆస్పత్రి నుంచి ఇందిరాగాంధీ సర్కిల్ వరకు ర్యాలీ చేపట్టారు. ఏరియా ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ హుస్సేన్ దోమల నిర్మూలనకు తీసుకోవాల్సిన చర్యలను వివరించారు. వైద్యులు డాక్టర్ ప్రశాంత్, ఆరోగ్య, ఆశా కార్యకర్తలు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

ఓడీచెరువు: ప్రపంచ మలేరియా దినోత్సవం సందర్భంగా శుక్రవారం స్థానిక పీహెచ్‌సీలో అవగాహన సదస్సు జరిగింది. డాక్టర్ భాను ప్రకాష్, డాక్టర్ కమల్ రోహిత్ వ్యాధి నివారణకు తీసుకోవాల్సిన చర్యలను తెలియజేశారు. ఆరోగ్య సిబ్బంది దాల్నాద్, విజయకుమారి, మురళి, నరేంద్ర, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

గాండ్లపెంట: ప్రపంచ మలేరియా దినోత్సవాన్ని పురస్కరించుకుని ఆరోగ్య సిబ్బంది, ఆశా కార్యకర్తలు స్థానిక పీహెచ్‌సీ నుంచి వైఎస్సార్ కూడలి వరకూ ర్యాలీ చేపట్టారు. వైద్యాధికారులు మహేశ్వరమారుతి, బాబాపక్రుద్దీన్ వ్యాధి నివారణకు కృషి చేద్దామని సిబ్బందితో ప్రతిజ్ఞ చేయించారు. హెచ్ఈ విజయ్‌కుమార్, సూపర్‌వైజర్లు ఉపేంద్రారెడ్డి, పార్వతమ్మ, సిబ్బంది పాల్గొన్నారు.

పుట్టపర్తి అర్బన్: మలేరియా వ్యాధి మనతోనే అంతం కావాలని డీఎంహెచ్‌ఓ డాక్టర్ ఫైరోజ బేగం పేర్కొన్నారు. ప్రపంచ మలేరియా దినోత్సవాన్ని పురస్కరించుకుని వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో మలేరియా అంతం మనతోనే అనే నినాదం తో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఎనుములపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఏర్పాటు చేసిన సమావేశంలో డీఎంహెచ్‌ఓ మాట్లాడుతూ మలేరియాను నిర్మూలించడానికి ప్రజలు పూర్తి సహకారం అందించాలన్నారు. అనంతరం ఎనుములపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం నుంచి గణేష్ సర్కిల్ వరకూ ర్యాలీ నిర్వహించి మానవహారం ఏర్పాటు చేసి ప్లకార్డుల ద్వారా ప్రజలకు అవగాహన కల్పించారు. అనంతరం సిబ్బందితో ప్రతిజ్ఞ చేయించారు. వైద్యాధికారులు డాక్టర్ జ్యోత్స్న, డాక్టర్ మునిచంద్రిక, సీహెచ్‌ఓ నగేష్, ఏఎంఓ లక్ష్మానాయక్, శానిటరీ ఇన్‌స్పెక్టర్ శివయ్య, ఎంపీఈఓలు రమణయ్య, వెంకటేష్, గోపినాయక్, ఎంఎస్‌యుఓ రమణయ్య, సూపర్‌వైజర్లు గఫూర్, రమణ, చంద్రకళ, సుశీలమ్మ, రామలక్ష్మి, సిబ్బంది పాల్గొన్నారు.

పుట్టపర్తి టౌన్: మలేరియా దినోత్సవం సందర్భంగా బుక్కపట్నం పీహెచ్‌సీ వైద్య సిబ్బంది ర్యాలీ నిర్వహించారు. ఈసందర్భంగా డాక్టర్ సురేష్ దోమల నిర్మూలనకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను తెలియజేశారు. హెల్త్ సూపర్‌వైజర్ లింగా రామ్మోహన్, హెల్త్ అసిస్టెంట్ మురళీకృష్ణ, కంటి వైద్య సహాయకుడు అనీల్‌కుమార్ పాల్గొన్నారు.

ధర్మవరం అర్బన్: మలేరియా రాకుండా ప్రజలు జాగ్రత్తలు పాటించాలని డిప్యూటీ డీఎంఅండ్‌హెచ్‌ఓ సెల్వియా సాలోమన్ తెలిపారు. స్థానిక ప్రభుత్వ ఆస్పత్రిలో శుక్రవారం ప్రపంచ మలేరియా దినోత్సవం సందర్భంగా వైద్య సిబ్బంది, ఏఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు పట్టణ పురవీధుల్లో ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో ప్రభుత్వ వైద్యులు శ్రావణి, మలేరియా సబ్ యూనిట్ అధికారి జయరాంనాయక్, సిబ్బంది పాల్గొన్నారు.

తలుపుల : స్థానిక ప్రభుత్వాస్పత్రి నుంచి వైద్యాధికారులు అష్ఫాప్, అశ్రీత ఆధ్వర్యంలో వైద్య సిబ్బంది మలేరియా దినోత్సవంపై శుక్రవారం ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో కదిరి మలేరియా సబ్ యూనిట్ అధికారి రామాంజనేయులు, సూపర్‌వైజర్ మహబూబ్‌బాషా, సిబ్బంది పాల్గొన్నారు.

మలేరియా దినోత్సవంపై ర్యాలీ

చెన్నేకొత్తపల్లి: మండల పరిధిలోని ఎన్ఎస్‌గేట్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్య సిబ్బంది ఆధ్వర్యంలో శుక్రవారం ప్రపంచ మలేరియా దినోత్సవాన్ని పురస్కరించుకుని ర్యాలీ చేపట్టారు. మండల వైద్యాధికారి డాక్టర్ రవినాయక్ ఆధ్వర్యంలో ఆసుపత్రి నుంచి ప్రారంభమైన ర్యాలీ ఎన్ఎస్‌గేట్ కూడలి వరకూ సాగింది. ఈ సందర్భంగా మలేరియాకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. మలేరియాను వ్యాపింపజేసే దోమలు పెరగకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో పలువురు వైద్య సిబ్బందితో పాటు ఆశావర్కర్లు పాల్గొన్నారు.

ముదిగుబ్బ: ప్రపంచ మలేరియా దినోత్సవం సందర్భంగా స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్ర సిబ్బంది ఆధ్వర్యంలో శుక్రవారం ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ రోజా మాట్లాడుతు ప్రతి శుక్రవారం డ్రైడేను నిర్వహించాలన్నారు. ఆరోగ్య విస్తరణాధికారి వేణుగోపాల్, పీహెచ్ఎన్‌టీ మంజుల, ఎంపీహెచ్ఎస్ అలివేలమ్మ తదితరులు పాల్గొన్నారు.

పట్టుబడిన మద్యం ధ్వంసం

చెన్నేకొత్తపల్లి: అక్రమంగా తరలిస్తూ పట్టుబడిన మద్యాన్ని చెన్నేకొత్తపల్లి పోలీస్‌స్టేషన్ పరిసర ప్రాంతంలో శుక్రవారం ధ్వంసం చేశారు. ప్రొహిబిషన్, ఎక్సైజ్ ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు 3 కేసుల్లోని 6.3 లీటర్ల బాటిళ్లు, 4 కేసుల్లోని 14.40 లీటర్ల ఆంధ్ర మద్యాన్ని ధ్వంసం చేసినట్లు చెన్నేకొత్తపల్లి ఎస్ఐ సత్యనారాయణ తెలిపారు.

పర్యాటకులపై దాడి హేయం

కదిరి అర్బన్: పహల్గాంలో పర్యాటకులపై ఉగ్రదాడి హేయమని ఎస్టీఎస్ఎన్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ స్మిత పేర్కొన్నారు. శుక్రవారం కళాశాలలో పహల్గామ్ ఉగ్రమూకల దాడిలో అసువులు బాసిన పర్యాటకుల ఆత్మలకు శాంతి కలగాలని కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. వక్తలు మాట్లాడుతూ సైనిక దుస్తుల్లో వచ్చి పర్యాటకులను కాల్చిన దుండగులను వెంటనే పట్టుకుని బహిరంగంగా ఉరి తీయాలన్నారు.

స్టాక్ పాయింట్ తనిఖీ



రికార్డులు పరిశీలిస్తున్న ఎమ్మెల్యే సునీత

చెన్నేకొత్తపల్లి: మండల కేంద్రంలోని పౌర సరఫరాల గోదామును (స్టాక్ పాయింట్) ఎమ్మెల్యే పరిటాల సునీత శుక్రవారం తనిఖీ చేశారు. గోదాములో ఉన్న స్టాక్ వివరాలను స్టాక్ పాయింట్ అధికారి లక్ష్మీ నారాయణను అడిగి తెలుసుకున్నారు. అలాగే ఉన్న స్టాక్‌ను పరిశీలించారు. అనంతరం తహసీల్దార్ కార్యాలయంలో ప్రజా సమస్యల పరిష్కార వేదికలో పాల్గొని ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. సమస్యలను త్వరగా పరిష్కరించాలని అధికారులకు సూచించారు. కార్యక్రమంలో తహసీల్దార్ సురేష్ కుమార్, సీఎస్‌డీటీ సావిత్రమ్మ తదితరులు పాల్గొన్నారు.

ఉత్సాహంగా గ్రాడ్యుయేషన్ డే



గ్రాడ్యుయేషన్ డేలో పాల్గొన్న విద్యార్థులు, అధ్యాపకులు

పుట్టపర్తి అర్బన్: పుట్టపర్తి సమీపంలోని సంస్కృతి విద్యాసంస్థల్లో శుక్రవారం గ్రాడ్యుయేషన్ డే ఘనంగా నిర్వహించారు. ఇంజినీరింగ్‌లో పూర్తి చేసుకొని వెళ్తూ మంచి ఉద్యోగాలు సాధించిన విద్యార్థులను అభినందించారు. ప్రిన్సిపాల్ డాక్టర్ హేమచంద్ర, డీన్ అకడమిక్స్ డాక్టర్ బాలకోటేశ్వరి మాట్లాడుతూ సమాజానికి ఉపయోగపడే ఎన్నో విషయాలను కళాశాలలో బోధించారని వాటిని సద్వినియోగం చేసుకొని పోటీ ప్రపంచంలో తమ ప్రతిభను చాటుకోవాలన్నారు. ఉద్యోగాలు చేస్తూ మరింత మందికి దారి చూపాలని సూచించారు.

సంక్షిప్త సమాచారం

యోగాతో సంపూర్ణ ఆరోగ్యం



మాట్లాడుతున్న యోగా గురువులు

కనగానపల్లి: సంపూర్ణ ఆరోగ్యానికి యోగా ఎంతో ఉపయోగపడుతుందని యోగాసన స్పోర్ట్స్ అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎం.రాజశేఖర్‌రెడ్డి తెలిపారు. శుక్రవారం మండల కేంద్రంలో జిల్లా స్థాయి యోగాసన పోటీల్లో పాల్గొనేందుకు విద్యార్థులకు ఉచిత యోగా శిక్షణ కార్యక్రమం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో యోగా విద్యతో కలిగే ఉపయోగాలు, ఆరోగ్య సూత్రాలపై యోగా గురువులు తెలియజేశారు. వేసవి సెలవుల్లో 30 రోజుల పాటు నిర్వహించే ఈ శిక్షణ కార్యక్రమం ద్వారా విద్యార్థులకు అన్ని యోగాసనాలపై అవగాహన కల్పించి జిల్లా, రాష్ట్ర స్థాయిలో పోటీల్లో పాల్గొనేందుకు అవకాశం కల్పిస్తామని శిక్షణ నిర్వాహకులు, యోగా గురువు సుబ్బరాయుడు పేర్కొన్నారు. కార్యక్రమంలో జిల్లా యోగాసన స్పోర్ట్స్ అసోసియేషన్ సభ్యులు నరసింహులు, దివాకర్, మారుతిప్రసాద్, తారకరాం, రాజారావు, సుబ్బయ్య, మధుసూదన్‌రెడ్డి, వేణుగోపాల్ పాల్గొన్నారు.

పండ్లతోటల పెంపకానికి దరఖాస్తుల ఆహ్వానం

గాండ్లపెంట: ఉపాధి హామీ కింద 2025–26లో పండ్ల తోటల పెంపకాని కోసం సన్న, చిన్న కారు రైతుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఎంపీడీఓ వెంకట్రామిరెడ్డి, ఏపీఓ చంద్రశేఖర్ శుక్రవారం తెలిపారు. 5 ఎకరాలకు మించకుండా ఉన్న సన్న కారు రైతులు మాడి, జీడీమామిడ, జామ, దానిమ్మ సపోట, సీతాఫలం, నేరేడు, చింత, రేగు డ్రాగన్‌ఫ్రూట్ తదితర పండ్ల తోటల పెంపకం చేపట్టవచ్చన్నారు. గతంలో పథకం కింద లబ్ధి పొందిన వారు అనర్హులన్నారు. దరఖాస్తుకు రేషన్‌కార్డు, ఆధార్‌కార్డు, పట్టాదారు పాసుపుస్తకం జిరాక్స్, తహసీల్దార్ కార్యాలయం నుంచి సన్న, చిన్న కారు రైతు ధ్రువీకరణ పత్రం, జాబ్‌కార్డు తదితర పత్రాలను జత పరిచి దరఖాస్తులను స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో అందించాలని సూచించారు.

స్పౌజ్ పింఛన్లకు దరఖాస్తు చేసుకోండి

బత్తలపల్లి/ కదిరి అర్బన్: స్పౌజ్ పింఛన్లకు అర్హులైన వారు దరఖాస్తు చేసుకోవాలని బత్తలపల్లి, కదిరి ఎంపీడీఓలు నరసింహనాయుడు, పోలప్ప పేర్కొన్నారు. శుక్రవారం వారు విలేకర్లతో మాట్లాడుతూ 2023 డిశంబర్ నుంచి 2024 అక్టోబర్ మధ్య పింఛన్ పొందుతూ చనిపోయిన భర్తల స్థానంలో భార్యలకు పింఛన్ ఇస్తామన్నారు. అలాంటి వారు ఈ రోజు నుంచే గ్రామ సచివాలయాల్లో దరఖాస్తులు అందజేయాలని సూచించారు. ఈ నెల 30లోపు వివరాలు సమర్పిస్తే మే 1 నుంచి అలాంటి వారికి కొత్తగా పింఛన్లు అందజేస్తామన్నారు. అర్హుల నుంచి దరఖాస్తులను స్వీకరించాలని గ్రామ సచివాలయ సిబ్బందిని ఎంపీడీఓలు ఆదేశించారు.

విద్యుదాఘాతంతో వ్యక్తి మృతి

ధర్మవరం రూరల్: విద్యుదాఘాతంతో గాయపడిన వ్యక్తి మృతి చెందాడు. వివరాలు.. వెంకటతిమ్మాపురం గ్రామానికి చెందిన సాకే రామాంజనేయులు (32)అనే వ్యక్తి గురువారం ట్రాన్స్‌ఫార్మర్ వద్ద ఫ్యూజులు వేస్తుండగా ప్రమాదవశాత్తు విద్యుదాఘాతానికి గురై తీవ్రంగా గాయపడిన విషయం విదితమే. కుటుంబ సభ్యులు అతడిని అనంతపురం ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ఆ తర్వాత బెంగళూరుకు తరలిస్తుండగా మార్గమధ్యంలో మృతి చెందాడు. మృతుడికి భార్య రాజేశ్వరి, ఒక కుమార్తె ఉన్నారు. ఈమేరకు కేసు నమోదు చేసినట్లు రూరల్ పోలీసులు తెలిపారు.